క్లుప్తంగా

ఉత్తమ అధ్యాపకుడిగా చంద్రశేఖరరావు



చంద్రశేఖరరావు

నెల్లిమర్ల: పట్టణంలోని సీకేఎంజీజీ కళాశాల ఎకనామిక్స్ లెక్చరర్ అలజంగి చంద్రశేఖరరావు రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మట్లాడుతూ.. చంద్రశేఖరరావు గతంలో సాలూరు, ఎస్ కోట, గంట్యాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసినట్లు చెప్పారు. 2017 జూలైలో నెల్లిమర్లకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది చంద్రశేఖరరావుకు అభినందనలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వైద్య ఖర్చులకు సాయం అందించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే సిఫార్సు మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మోపాడలోని ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అప్పలనాయుడు బాధితులకు చెక్కులు అందజేశారు.

సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక స్థితి మెరుగు

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలోని 50వ డివిజన్‌లలో 'గడపగడపకు మన ప్రభుత్వం'



గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగు పర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 50వ డివిజన్‌లో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి కోలగట్ల రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఉన్న ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. విద్యుత్ స్తంభాలు లేవని కొందరు చెప్పడంతో వెంటనే అక్కడున్న విద్యుత్‌శాఖ అధికారులకు పిలిచి విద్యుత్ దీపాలు ఏర్పాటుకు చర్యలు



40వ డివిజన్‌లో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి కోలగట్ల తమ్మన్నశెట్టి

తీసుకోవాలని ఆదేశించారు. నవరత్న పథకాలతో అన్ని వర్గాలకు మేలు జరుగుతోందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా..అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి పథకాలు అందజేస్తున్నామన్నారు. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ.. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో నగరంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతీ కుటుంబానికి లబ్ధి జరగడంతో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నారన్నారు. కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌నగర్ గతంలో 3500 మంది లబ్ధిదారులకు గృహ సౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. అలాగే ప్రస్తుతం గుంకలాం, సారిక వంటి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లయా యాదవ్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక నాయకులు తోనంగి జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

40వ డివిజన్‌లో..

అదేవిధంగా 40వ డివిజన్‌లో జరిగిన 'గడపగడప మన ప్రభుత్వం' కార్యక్రమంలో జోనల్ ఇన్‌ఛార్జి కోలగట్ల తమ్మన్న శెట్టి పాల్గొన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి అందించిన లబ్ధి వివరాలతో ఉన్న బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు



విద్యార్థికి నగదు, పుస్తకాలు అందజేస్తున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: విద్యార్థులు చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. బొత్స రామ్మోహనరావు వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక తోటపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో సరస్వతి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు నగదు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తే చదువులో రాణిస్తారని, ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు. కార్యక్రమంలో మీసాల సత్యవేణి, బొత్స శ్రీను, బొత్స రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిపై అవగాహన

డెంకాడ: రైతులు తమకు కావాల్సిన విత్తనాలను వారే తయారు చేసుకోవాలని, దీని వల్ల నాణ్యమైన విత్తనాలు పొందడంతో పాటు విత్తనాల కొనుగోలుకు అయ్యే ఖర్చును ఆదా చేసుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి టి.సంగీత అన్నారు. మండలంలోని పినతాడివాడ గ్రామంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా రైతులకు విత్తనోత్పత్తిపై సోమవారం అవగాహన కల్పించారు. వరిసాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ, విత్తనాల ఎంపిక, యాజమాన్య పద్ధతులు, విత్తనాల సేకరణ తదితర అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ నిర్మల, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చింనాయుడు, వ్యవసాయ సహాయకులు ఆర్.కిరణ్మయి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాక్ జీ-20 సదస్సు



మాక్ జీ-20 సదస్సులో విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం ఉన్నత పాఠశాలలో హరితదళ క్లబ్, జూనియర్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మాక్ జీ-20 సదస్సును సోమవారం నిర్వహించారు. విద్యార్థులు జీ-20 దేశాధినేతల మాదిరిగా పర్యావరణ సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై ఈ సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వేణుగోపాలరావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం కలిగించేందుకు జీ-20 నమూనా సదస్సు నిర్వహించామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ ప్రాంతీయ సమన్వయకర్త సత్యప్రకాష్, ఉపాధ్యాయులు ప్రసాద్, రమణి, నాగేశ్వరరావు, సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

- వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రదేవి
- పలువురు ఉపాధ్యాయులకు సత్కారం

విజయనగరం: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యతయుతమైనదని వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి అన్నారు. స్థానిక గుండాల వారి వీధిలో ఉన్న ఆమె నివాసంలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎన్.సూర్యకాంతి, సీహెచ్ గాయత్రి, ఐ.వాసవి, ఎన్.అనూషలను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను ఇంజినీర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే అవకాశం ఉపాధ్యాయులకు లభించే గొప్ప అవకాశమన్నారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ వృత్తిని అంకితభావంతో నిర్వర్తించి దేశ సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రతినిధి జి.హిమబిందు, వనిత వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్ సాయిసంతోషిణి, కార్యదర్శి పార్వతి, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



బోధనోపకరణాల కిట్లు పంపిణీ



దివ్యాంగ విద్యార్థులకు కిట్లు అందచేస్తున్న ఎంఈఓ రాజ్‌కుమార్, తదితరులు

పూసపాటిరేగ: స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు బోధనోపకరణాల కిట్లను ఎంఈఓ ఎ.రాజ్‌కుమార్ సోమవారం పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన జాతీయ మేథో వైకల్య సాధికార సంస్థ సౌజన్యంతో వీటిని సమకూర్చినట్లు చెప్పారు. దివ్యాంగ పిల్లలకు ఇంటి వద్దే బోధించేందుకు అవసరమైన బోధనోపకరణాలు ఇందులో ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు ఎస్.బంగారునాయుడు, ఎ.వెంకటేశ్వరరావు, అర్చన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'భవిత'తో భరోసా



ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ విజయ్‌కుమార్

నెల్లిమర్ల: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న భవిత కేంద్రాలు దివ్యాంగులకు భరోసా కల్పిస్తాయని మండల విద్యాశాఖాధికారి-2 ఈపు విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల బంగారు భవిత కోసం సమగ్రశిక్ష పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రతీ సోమవారం ఫిజియోథెరపీ చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పిజియోథెరపీ డాక్టర్ రామ్మోహన్, ఐఈ ఆర్‌పీలు బి.అప్పలనాయుడు, పురుషోత్తం నాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విజయనగరం అర్బన్: నగరంలోని ఫోర్ట్‌సిటీ పాఠశాలలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీప్రైమరీ, ప్రైమరీ పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక, మీరాబాయి వేషధారణల్లో ఆకట్టుకున్నారు. మిగిలిన తరగతుల విద్యార్థులకు సంగీతం, నృత్యం, వక్తృత్వం, వ్యాసరచన తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల చైర్మన్ కేవీపీ రాజు(శివ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ పాల్గొన్నారు.





అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఆర్‌బీకే, వెల్‌నెస్, సచివాలయ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను లబ్ధిదారులకు సకాలంలో అందజేయలన్నారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణాలు, జలజీవన్ మిషన్ పనుల్లో పురోగతిని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, పంచాయతీ రాజ్ జేఈ చంద్రునాయుడు, ఏపీఓ ఆదిబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు జొన్నాడ ఆర్‌బీకే ప్రారంభం

డెంకాడ: మండలంలోని జొన్నాడ రైతుభరోసా కేంద్రాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం ప్రారంభిస్తారని ఎంపీడీఓ స్వరూపారాణి తెలిపారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తారని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులంతా పాల్గొనాలని కోరారు.





నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: నిబంధనలు అతిక్రమించి భవన నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు హెచ్చరించారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న భవన నిర్మాణాలను సోమవారం నిశితంగా పరిశీలించారు. నిర్మాణాలలో లోటుపాట్లను గమనించారు. పరిశీలనలో రెండు భవన నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో పత్రాల జారీను నిలుపుదల చేశారు. మరో రెండు భవనాలు నిబంధనలకు అనుకూలంగా ఉండడంతో వాటికి ధృవపత్రాలను జారీ చేసేందుకు అనుమతించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో భవన నిర్మాణాలపై ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. అనుమతులు తీసుకున్న నాటి నుంచి భవన నిర్మాణ పరిస్థితులను గమనిస్తూ ఉండాలని, నిర్మాణ విషయంలో భవన యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. అప్పటికీ నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లయితే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఇకమీదట పూర్తయిన నిర్మాణాలను తానే స్వయంగా తనిఖీ చేసి అవసరమైన ధ్రువపత్రాలను జారీ చేస్తామన్నారు. ఆయన వెంట పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది, కార్యదర్శులు ఉన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

నెల్లిమర్ల: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని ది జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మేనేజర్ ఆర్.హరికేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్యాంకులో లాకర్ సదుపాయాన్ని తక్కువ ధరకే అందిస్తున్నట్లు తెలిపారు. ఏడాదికి రూ.590 ఉన్న లాకర్ సదుపాయాన్ని ఖాతాదారులకు రూ.295లకే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు సిబ్బంది నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని పలు పాఠశాలలకు వెళ్లి అక్కడి సిబ్బందికి డిపాజిట్ల రేట్లు, వడ్డీరేట్లు, ఆర్‌డీ, ఎస్‌బీ అకౌంట్లపై అవగాహన కల్పించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

విజయనగరం టౌన్: ఉడాకాలనీ ఫేజ్-2లో పలు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు స్తంభాలు పక్కకు ఒరిగిపోవడంతో పాటు వైర్లు వేలాడుతున్నాయి. దీంతో స్థానికంగా నివాసం ఉంటున్నవారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభాలు సరిచేయాలని సంబంధిత అధికారులను కోరినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాలను, వైర్లను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన వైద్య శిబిరం

విజయనగరం అర్బన్: జెన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో గత నెల 30 నుంచి నిర్వహించిన వైద్య శిబిరం సోమవారంతో ముగిసింది. వారం రోజుల పాటు నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 2వేల మంది విద్యార్థులు, 250 మంది బోధన, బోధనేతర సిబ్బందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరోగ్య సూత్రాలు, ఆహార నియమాలపై వైద్యులు జి.గౌతమి, జి.సౌజన్య, ఎల్.సుమలత, కె.ఎస్.మూర్తి, తదితరులు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వి.మణికుమార్, మహిళా సాధికార సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ బి.నళిని, డిస్పెన్సరీ కోఆర్డినేటర్ ఆర్‌డీడీవీ శివరాం పాల్గొన్నారు.



